తరంగాలు

రిపోర్టర్లు కావలెను

అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.

సంప్రదించండి...

94949 23460

ఎడిటర్ : రత్నం నాగరాజా

RNI . TELTEL / 2022 / 83463

జాతీయ దిన పత్రిక

# తరంగాలు

Tharangalu Daily News Paper

ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
సోమవారం
17 నవంబర్ 2025
సంపుటి 90
సంచిక 3
పేజీలు 8
వెల రూ. 5.00

Epaper : WWW.tharangalu.comEpa

Published From: Hyderabad,Circulated: Hyderabad,Nalgonda,Khammam,Rangareddy,sangareddy,Warangal,Kurnool,Kadapa,Amaravathi,Krishna

## హైదరాబాద్‌లో భారీ దోపిడీ..

### యజమానిని కట్టేసి రూ.50 లక్షల సొత్తు దోచుకున్న నేపాల్ ముఠా

గన్‌రాక్ ఎన్‌క్లేవ్‌లో భారీ దోపిడీ

ఇంట్లో పనిచేస్తున్న నేపాలీ వ్యక్తి ఘాతుకం

మరో నలుగురితో కలిసి యజమానిపై దాడి



తరంగాలు న్యూస్, డెస్క్, నవంబర్ 16 : హైదరాబాద్ కార్ఖానా పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ దోపిడీ జరిగింది. గన్‌రాక్ ఎన్‌క్లేవ్‌లో నివసిస్తున్న కెప్టెన్ గిరి (75) ఇంట్లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇంట్లో పనిచేసే నేపాల్‌కు చెందిన వ్యక్తే మరో నలుగురితో కలిసి ఈ దోపిడీకి పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. వివరాల్లోకి వెళితే.. కెప్టెన్ గిరి ఇంట్లో పనిచేస్తున్న నేపాలీ వ్యక్తి, పథకం ప్రకారం మరో నలుగురిని ఇంట్లోకి తీసుకువచ్చాడు. అనంతరం ముఠా సభ్యులు గిరిపై కర్రలతో దాడి చేసి, ఆయన్ను కట్టేశారు. ఆ తర్వాత ఇంట్లోని బీరువాను పగులగొట్టి సుమారు రూ.50 లక్షల విలువైన సొత్తును దోచుకెళ్లారు. దాదాపు 25 తులాలకు పైగా బంగారం, రూ. 23 లక్షల నగదును దుండగులు అపహరించినట్లు బాధితుడి కుటుంబసభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సమాచారం అందుకున్న కార్ఖానా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఇంట్లో పనిచేసే వ్యక్తి వివరాల ఆధారంగా దర్యాప్తు ముమ్మరం చేశారు.

## రామోజీ ఫిల్మ్ సిటీ తెలంగాణకు గర్వకారణం





- రామోజీరావు 89వ జయంతి సందర్భంగా ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానం
- ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరు
- ఈనాడు, ఈటీవీ తెలుగు ప్రజల జీవితంలో భాగమయ్యాయని వ్యాఖ్య
- రామోజీ ఫిల్మ్ సిటీ తెలంగాణకు నాలుగో అద్భుతం అన్న సీఎం రేవంత్
- తెలుగు సినిమా ఎదుగుదలలో ఆర్‌ఎఫ్‌సీ పాత్రను కొనియాడిన సీఎం
- రామోజీ ఆశయాలను కొనసాగిస్తున్న కుటుంబాన్ని అభినందించిన రేవంత్

తరంగాలు న్యూస్, డెస్క్, నవంబర్ 16 : రామోజీ గ్రూప్ సంస్థల వ్యవస్థాపకులు రామోజీరావు 89వ జయంతిని పురస్కరించుకుని రామోజీ ఎక్సలెన్స్ అవార్డులు-2025 ప్రదానోత్సవం హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. రామోజీ ఫిల్మ్ సిటీని రాష్ట్రానికి 'నాలుగో అద్భుతం'గా అభివర్ణిస్తూ ప్రశంసలు కురిపించారు. ఈ వేడుకలో రామోజీరావు దార్శనికతను, ఆయన సేవలను ప్రముఖులు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ హాజరయ్యారు. ఆయనతో పాటు తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ మహేశ్ వర్మ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, రామ్ మోహన్ నాయుడు, మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి. రమణ తదితర రాజకీయ, పారిశ్రామిక, సినీ రంగ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, రామోజీ గ్రూప్ సంస్థలు తెలంగాణకు గర్వకారణమని కొనియాడారు. "హైదరాబాద్‌కు చారిత్రకంగా చార్మినార్, గోల్కొండ...

2

## ఎర్రకోట పేలుడు ఘటనా స్థలంలో సైన్యం బుల్లెట్లు..

### - విచారణ ముమ్మరం

- ఘటనా స్థలంలో 9 ఎంఎం బుల్లెట్లు స్వాధీనం
- బుల్లెట్లు భద్రతా సిబ్బందివి కావని నిర్ధారణ
- రెండు కిలోల అమ్మోనియం నైట్రేట్ వాడినట్లు గుర్తింపు



వివరాలు 2 లో..

## హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియం వద్ద కాలిబూడిదైన ఎలక్ట్రిక్ కారు

- పార్కింగ్‌లో ఉన్న కారులో అకస్మాత్తుగా చెలరేగిన మంటలు
- ప్రమాదంలో మరో కారు పాక్షికంగా ధ్వంసం
- అరగంట శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చిన ఫైర్ సిబ్బంది
- ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్న అధికారులు
- ప్రమాద కారణాలపై పోలీసుల దర్యాప్తు ప్రారంభం



తరంగాలు న్యూస్, డెస్క్, నవంబర్ 16 : హైదరాబాద్ నగరంలోని ఎన్టీఆర్ స్టేడియం సమీపంలో ఆదివారం మధ్యాహ్నం ఓ ఎలక్ట్రిక్ కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగి కలకలం సృష్టించాయి. ఈ అగ్నిప్రమాదంలో కారు పూర్తిగా కాలి బూడిదైంది. మంటల తీవ్రతకు సమీపంలో పార్క్ చేసి ఉన్న మరో కారు కూడా పాక్షికంగా దెబ్బతింది. వివరాల్లోకి వెళితే, నారాయణగూడ పరిధిలోని ఎన్టీఆర్ స్టేడియం వద్ద పార్క్ చేసి ఉన్న ఓ ఎలక్ట్రిక్ కారు నుంచి ఒక్కసారిగా దట్టమైన పొగలు, మంటలు వ్యాపించాయి. ఇది గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది, సుమారు అరగంట పాటు శ్రమించి మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటన కారణంగా ఆ ప్రాంతంలో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. గాంధీనగర్, దోమలగూడ పోలీసులు ...

2

## రాజస్థాన్ సీఎస్‌గా తెలుగు అధికారి ఓరుగంటి శ్రీనివాస్

- ఓరుగంటి శ్రీనివాస్ 1989 రాజస్థాన్ క్యాడర్ బ్యాచ్‌కు చెందిన ఐఎఎస్ అధికారి
- అరకులోయలో జన్మించి, ఉస్మానియాలో ఇంజినీరింగ్ పూర్తిన శ్రీనివాస్
- ఇటీవల చంద్రబాబు పాలనపై ప్రశంసలతో వార్తల్లోకి వచ్చిన వైనం



తరంగాలు న్యూస్, డెస్క్, నవంబర్ 16 : రాజస్థాన్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)గా తెలుగు ఐఏఎస్ అధికారి ఓరుగంటి శ్రీనివాస్ నియమితులయ్యారు. 1989 రాజస్థాన్ క్యాడర్‌కు చెందిన ఆయన నియామకానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వంలో పరిపాలన సంస్కరణల విభాగం కార్యదర్శిగా పనిచేస్తున్న ఆయనను, రాజస్థాన్ ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కేంద్రం తిరిగి సొంత క్యాడర్‌కు పంపింది. ఢిల్లీ నుంచి రిలీవ్ అయిన మరుసటి రోజే ఆయనకు సీఎస్‌గా కీలక బాధ్యతలు అప్పగించడం గమనార్హం. రేపు ఆయన పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. 2026 సెప్టెంబరు వరకు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. ఓరుగంటి శ్రీనివాస్‌కు తెలుగు రాష్ట్రాలతో విడదీయరాని బంధం ఉంది. ఆయన 1966 సెప్టెంబరు 1న అరకు లోయలో జన్మించారు. ఆయన తండ్రి జాతీయ మలేరియా నిర్మూలన కార్యక్రమంలో చీఫ్ ...

2

## పవన్ కల్యాణ్ వల్ల ఇతర మతాల్లోకి వెళ్లిన హిందువుల్లో ఆలోచన మొదలైంది - బండి సంజయ్

- హిందువులు ఓటు బ్యాంకుగా మారాలని బండి సంజయ్ పిలుపు
- జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఫలితంపై కీలక వ్యాఖ్యలు
- మతం మారిన వారు తిరిగి హిందూ ధర్మంలోకి రావాలని విజ్ఞప్తి

తరంగాలు న్యూస్, డెస్క్, నవంబర్ 16 : రాష్ట్రంలోని హిందువులంతా ఏకతాటిపైకి వచ్చి ఓటు బ్యాంకుగా మారాలని కేంద్రమంత్రి బండి సంజయ్ పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఫలితం తర్వాత హిందువుల్లో కసి పెరిగిందని, ఇకనైనా మేల్కొని ఐక్యత చాటాలని ఆయన అన్నారు. కూకట్‌పల్లిలో నిర్వహించిన కాపు కులస్తుల కార్తిక వన భోజనాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్‌లో ముస్లింలకు కొమ్ముకాసే దుస్థితి ఏర్పడిందని విమర్శించారు. మతం మార్చుకోవడం అంటే దేవుళ్లను మోసం



చేయడమేనని అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఇతర మతాల్లోకి వెళ్లిన వారంతా 'ఘర్ వాపసీ' ద్వారా తిరిగి హిందూ ధర్మంలోకి రావాలని కోరారు. అలా తిరిగి వచ్చేవారి కోసం హిందూ ధర్మ రక్షణ ద్వారాలు ఎప్పుడూ తెరిచే ఉంటాయని హామీ ఇచ్చారు. హిందువుగా పుట్టడం గర్వకారణమని, హిందూ సనాతన ధర్మం ఎంతో గొప్పదని బండి సంజయ్ తెలిపారు. పవన్ కల్యాణ్ సనాతన ధర్మంపై చేస్తున్న ప్రచారం వల్ల ఇతర మతాల్లో చేరిన హిందువుల్లో పునరాలోచన మొదలైందన్నారు. మోసపోయి ఇతర మతాల్లోకి వెళ్లిన వారిని ఆదుకునే బాధ్యత తనదని భరోసా ఇచ్చారు. కులాలు తమ సామాజికవర్గ సంక్షేమం కోసం పనిచేస్తూనే, హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలని పిలుపునిచ్చారు. హిందూ సనాతన ధర్మ రక్షణే తన జీవిత లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

## ఇమ్మడి రవితోనే ఐ బొమ్మ, బప్పం టీవీ వెబ్‌సైట్‌లను షట్ డౌన్ చేయించిన పోలీసులు

- ఐ బొమ్మ, బప్పం టీవీ వెబ్‌సైట్ల నిర్వాహకుడు ఇమ్మడి రవి అరెస్ట్
- ఫ్రాన్స్ నుంచి రాగానే ఎయిర్‌పోర్ట్‌లో పట్టుకున్న సైబరాబాద్ పోలీసులు
- గతంలో పోలీసులకే సవాల్ విసిరిన పైరసీ కింగ్‌పిన్
- రూ.3 కోట్ల నగదు, వందల కొద్దీ హార్డ్ డిస్క్‌లు స్వాధీనం
- కస్టడీ కోసం నాంపల్లి కోర్టులో పిటిషన్ వేయనున్న పోలీసులు

2

# రామోజీ ఫిలిం సిటీ తెలంగాణ కు గర్వకారణం - సీఎం రేవంత్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి..
కోట వంటి అద్భుతాలు ఉన్నాయి. ఆధునిక యుగంలో హైటెక్ సిటీ మరో అద్భుతంగా నిలిచింది. ఇప్పుడు వాటి సరసన రామోజీ ఫిల్మ్ సిటీ నాలుగో అద్భుతంగా చేరింది. ఇది తెలంగాణకు దక్కిన గొప్ప ఆస్తి" అని ఆయన పేర్కొన్నారు. రామోజీ స్ఫూర్తిని కొనసాగిస్తూ ఈ అవార్డులను ఏర్పాటు చేసిన వారి కుటుంబ సభ్యులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

తెలుగు సినిమా పరిశ్రమ ఎదుగుదలలో రామోజీ ఫిల్మ్ సిటీ పోషించిన పాత్రను రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా ప్రస్తావించారు. "ఒకప్పుడు నంది అవార్డులతో పరిమితమైన తెలుగు సినిమా, నేడు ఆస్కార్ స్థాయికి చేరిందంటే అందుకు రామోజీ ఫిల్మ్ సిటీ, ఇక్కడి స్టూడియోలు అందించిన చేయూత ఎంతో ఉంది" అని వివరించారు.

ఈనాడు పత్రిక 50 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భాన్ని గుర్తుచేస్తూ, రామోజీరావు తెలుగు ప్రజల దినచర్యలో భాగమైపోయారని అన్నారు. "ప్రతిరోజూ ఉదయం ఈనాడు చదవడం, రాత్రి ఈటీవీ వార్తలు చూడటాన్ని ఆయన ఒక అలవాటుగా మార్చారు. ఇది రాజకీయ నాయకులకు సైతం ఒక వ్యసనంగా మారింది" అని తెలిపారు. తాను కూడా రోజూ ఈనాడు చదువుతానని, రాత్రి 9 గంటలకు ఈటీవీ వార్తలు చూస్తానని సీఎం తన వ్యక్తిగత అనుభవాన్ని పంచుకున్నారు. రామోజీరావు తన జీవితంలో ప్రతి రంగంలో 'నెంబర్ వన్'గా నిలవడానికి రోజుకు 18 గంటలు శ్రమించారని, ఆయన స్ఫూర్తి అందరికీ ఆదర్శమని రేవంత్ రెడ్డి కొనియాడారు.

## రామోజీ ఎక్సలెన్స్ అవార్డు గ్రహీతలు వీరే!

అమలా రూయా : గ్రామీణాభివృద్ధి విభాగంలో అసాధారణ కృషి చేసినందుకు అవార్డు లభించింది. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాల ద్వారా లక్షలాది మందికి ప్రయోజనం చేకూర్చారు.

శ్రీకాంత్ బొల్లా: యూత్ ఐకాన్ కేటగిరీలో గుర్తింపు పొందారు. యువతకు ప్రేరణగా నిలిచి, విద్య, ఉపాధి రంగాల్లో కొత్త మార్గాలను సృష్టించారు.

మాధవీలత: సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో అద్భుత ప్రతిభ చూపి అవార్డు సాధించారు. ఆవిష్కరణల ద్వారా శాస్త్రీయ పరిజ్ఞానాన్ని ముందుకు నడిపించారు.

ఆకాశ్ టాండన్: మానవసేవా రంగంలో అమానత్వంగా కృషి చేసినందుకు గౌరవం లభించింది. అసహాయులకు, అనాథలకు అందించిన సేవలు అపూర్వమైనవి.

ప్రసన్న శ్రీ: కళ-సంస్కృతి క్షేత్రంలో సృజనాత్మకతకు అవార్డు. భారతీయ సంస్కృతి, కళలను ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేశా-రు.

జైదీప్ హార్డికర్: జర్నలిజం రంగంలో సత్యసంధత, నిర్మలతతో పనిచేసినందుకు గుర్తింపు. సమాజ సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చారు.

పల్లవి ఘోష్: మహిళా సాధికారత కేటగిరీలో అవార్డు. మహిళల హక్కులు, సాధికారత కోసం చేసిన కృషి ప్రశంసనీయమైనది.

### రామోజీరావు ఒక స్ఫూర్తి ప్రదాత: ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ ప్రశంసలు

రామోజీ గ్రూప్ సంస్థల వ్యవస్థాపకుడు రామోజీరావు ఒక కుగ్రామం నుంచి వచ్చి అసాధారణ విజయాలు సాధించిన స్ఫూర్తి ప్రదాత అని భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ కొనియాడారు. రామోజీ ఫిల్మ్ సిటీలో జరిగిన 'రామోజీ ఎక్సలెన్స్ జాతీయ అవార్డులు 2025' ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

ఈ సందర్భంగా రాధాకృష్ణన్ మాట్లాడుతూ, "రామోజీరావు తన సిబ్బందిలో బృంద స్ఫూర్తిని నింపేవారు. తన ఆలోచనలను సంస్థలుగా, వాస్తవాలుగా మార్చిన అసాధారణ వ్యక్తి. దేశంలో ఎక్కడైనా విపత్తు సంభవించినా తక్షణమే స్పందించి, ప్రజలను సైతం భాగసా-్వములుగా చేస్తూ సహాయం అందించడం ఆయన ప్రత్యేకత" అని గుర్తుచేశారు.

రామోజీరావు సేవలను కొనియాడుతూ, "సమాజానికి స్ఫూర్తిగా నిలబడటమే ఒక గొప్ప విజయం. రామోజీ ఫిల్మ్ సిటీని ఒక స్క్రిప్ట్ రాస్తే, 'ఫస్ట్ ప్రింట్'తోనే సినిమా విడుదల చేసేలా తీర్చిదిద్దారు" అని అన్నారు. రామోజీరావు 89వ జయంతి సందర్భంగా ఈ అవార్డుల ప్రదానోత్సవాన్ని నిర్వహించడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు.

# హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియం వద్ద కాలిబూడిదైన ఎలక్ట్రిక్ కారు



మొదటిపేజీ తరువాయి..
వెంటనే రంగంలోకి దిగి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ప్రమాద సమయంలో వాహనంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు తెలిపారు.

ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదని, సాంకేతిక లోపం ఏమైనా ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని ఓ సీనియర్ పోలీసు అధికారి వెల్లడించారు. ఫోరెన్సిక్ బృందం ఆధారాలు సేకరించిన తర్వాత పూర్తి వివరాలు తెలుస్తా-యని ఆయన పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతున్న త-రుణంలో ఇలాంటి ఘటనలు వాహనదారుల్లో భద్రతపై ఆందోళన కలిగిస్తున్నాయి.

# ఎర్రకోట పేలుడు ఘటనా స్థలంలో సైన్యం బుల్లెట్లు..

## - విచారణ ముమ్మరం

మొదటిపేజీ తరువాయి..
తరంగాలు న్యూస్, డెస్క్, నవంబర్ 16 : ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు పేలుడు ఘటనపై దర్యాప్తు బృందాలు విచారణను వేగవంతం చేశాయి. ఈ కేసులో కీలక ఆధారాలు లభించాయి. ఘటనా స్థలంలో ఫోరెన్సిక్ బృందాలు మూడు బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు. ఇవి సైనికులు వాడే 9 ఎంఎం కాట్రిడ్జ్‌లు అని వెల్లడించారు. అయితే, ఆ ప్రదేశంలో ఎలాంటి తుపాకీ లభ్యం కాలేదని స్పష్టం చేశారు. ఘటనా స్థలంలో భద్రతా విధుల్లో ఉన్న పోలీసులు, భద్రతా సిబ్బందికి అందించిన బుల్లెట్లను




పరిశీలించామని, స్వాధీనం చేసుకున్న బుల్లెట్లు వారికి సంబంధించినవి కావని పోలీసులు ధ్రువీకరించారు. దీంతో భద్రతా బలగాలు వాడే బుల్లెట్లు అక్కడికి ఎలా వచ్చాయనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. దీనిపై స్పష్టత కోసం స్థానికంగా ఉన్న సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. సోమవారం ఎర్రకోట మెట్రోస్టేషన్ సిగ్నల్ వద్ద జరిగిన ఈ పేలుడులో సుమారు రెండు కిలోల అమ్మోనియం నైట్రేట్‌ను ఉపయోగించినట్లు ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ అధికారులు నిర్ధారించారు. ఘటనా స్థలం నుంచి ఇప్పటివరకు దాదాపు 40 నమూనాలను సేకరించారు. వీటిలో బుల్లెట్లతో పాటు రెండు వేర్వేరు రకాల పేలుడు పదార్థాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా భావిస్తున్న ఉమర్ నబీతో సంబంధం ఉన్న మరికొందరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కారులో ఇంకా ఎవరైనా ఉన్నారా, పేలుడు పదార్థాలను ఎక్కడ నింపారనే వివరాలను రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నారు.

# రాజస్థాన్ సీఎస్‌గా తెలుగు అధికారి ఓరుగంటి శ్రీనివాస్

మొదటిపేజీ తరువాయి..
ఎంటమాలజిస్ట్‌గా పనిచేసేవారు. అరకు, తెలంగాణలోని దుమ్ముగూడెంలో పెరిగిన శ్రీనివాస్, భద్రాచలం పంచాయతీ స్కూల్‌లో చదివారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి కెమికల్ ఇంజినీరింగ్‌లో బీటెక్, ఎంటెక్ పూర్తిచేశాక ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన 28వ జాతీయ ఈ-గవర్నెన్స్ సదస్సులో ఆయన ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై చేసిన ప్రశంసలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమయ్యాయి. "90వ దశకం నుంచి మీరు స్మార్ట్ గవర్నెన్స్‌కు ఇచ్చిన ప్రాధాన్యం కోట్ల మందికి ప్రయోజనం చేకూర్చింది. నేను అండర్ సెక్రటరీగా చేరినప్పుడు మీరు సీఎంగా ఉన్నారు, ఇప్పుడు 37 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకోబోతున్న తరుణంలోనూ మీరే సీఎంగా ఉన్నారు. దేశానికి మీరు చేసిన సేవలకు మా సెల్యూట్ స్వీకరించండి" అని చంద్రబాబును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. శ్రీనివాస్ జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కూడా. ఆయన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు మనవరాలిని వివాహం చేసుకున్నారు. అరకు గిరిజనులతో తనకున్న జ్ఞాపకాలను 'టువర్డ్స్ ఏ న్యూ ఇండియా' పుస్తకంలో ఆయన ప్రస్తావించారు.

# ఇమ్మడి రవితోనే ఐ బొమ్మ, బప్పం టీవీ వెబ్‌సైట్‌లను షట్ డౌన్ చేయించిన పోలీసులు



మొదటిపేజీ తరువాయి..
తరంగాలు న్యూస్, డెస్క్, నవంబర్ 16 : కొత్త సినిమాలు విడుదలైన గంటల్లోనే ఆన్‌లైన్‌లో ఉచితంగా అందిస్తూ సవాల్ విసిరిన 'ఐ బొమ్మ', 'బప్పం టీవీ' వెబ్‌సైట్ల నిర్వాహకుడు, ప్రధాన సూత్రధారి ఇమ్మడి రవిని పోలీసులు అరెస్ట్ చేయడం తెలిసిందే. గతంలో "దమ్ముంటే పట్టుకోండి.. నా వెబ్‌సైట్ల జోలికొస్తే మీ డేటా లీక్ చేస్తా" అంటూ పోలీసులకే బహిరంగంగా హెచ్చరికలు జారీ చేసిన రవిని.. ఫ్రాన్స్ నుంచి హైదరాబాద్ రాగానే శంషాబాద్ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్నారు. తాజాగా, 'ఐ బొమ్మ', 'బప్పం టీవీ' వెబ్‌సైట్లను అతడితోనే శాశ్వతంగా మూసివేయించారు. విశాఖపట్నంకు చెందిన ఇమ్మడి రవి సైబర్ టెక్నాలజీలో అత్యంత నైపుణ్యం కలిగిన వ్యక్తి. తనకున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేస్తూ పైరసీ ప్రపంచంలోకి అడుగుపెట్టాడు. తొలుత సాధారణ స్థాయిలో మొదలుపెట్టి, ఐ బొమ్మ, బప్పం వంటి వెబ్‌సైట్లను సృష్టించి తెలుగు, తమిళం, హిందీతో పాటు పలు భాషల చిత్రాలను, ఓటీటీ కంటెంట్‌ను పైరసీ చేస్తూ వచ్చాడు. తన కార్యకలాపాలను ఎవరూ గుర్తించకుండా ఫ్రాన్స్‌లో నివసిస్తూ, కరేబియన్ దీవులు, యూరప్ దేశాల్లోని ఆఫ్‌షోర్ సర్వర్ల ద్వారా ఈ నెట్‌వర్క్‌ను నడిపాడు. భార్యతో విడిపోయిన తర్వాత ఒంటరిగా జీవిస్తున్న రవి, తన పూర్తి సమయాన్ని ఈ పైరసీ సామ్రాజ్యాన్ని విస్తరించడానికే కేటాయించాడు.

### అత్యాధునిక టెక్నాలజీతో పైరసీ దందా

రవి తన పైరసీ కార్యకలాపాలను అత్యంత పకడ్బందీగా నిర్వహించాడు. పోలీసులు ఒక డొమైన్‌ను బ్లాక్ చేస్తే, వెంటనే ibomma.tv, ibomma.new వంటి మిర్రర్ సైట్లను అందుబాటులోకి తెచ్చేవాడు. Cloudflare వంటి కంటెంట్ డెలివరీ నెట్‌వర్క్ (CDN) సేవలను వాడుతూ తన సర్వర్ల ఐపీ అడ్రస్‌లను దాచిపెట్టేవాడు. థియేటర్లలో మొబైల్ ఫోన్లతో రికార్డ్ చేసిన కాపీలు, ప్రొడక్షన్ హౌస్‌ల నుంచి లీకైన స్క్రీనర్ కాపీలను సంపాదించి టొరెంట్ ఫైల్స్‌గా మార్చి అప్‌లోడ్ చేసేవాడు. తనను ఎవరూ ట్రేస్ చేయకుండా VPN, TOR నెట్‌వర్క్‌ల ద్వారా ఎన్‌క్రిప్టెడ్ పద్ధతిలో ఫైల్స్‌ను సర్వర్లకు చేరవేసేవాడు. అంతేకాకుండా, నెట్‌ఫ్లిక్స్, ప్రైమ్ వంటి ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ల నుంచి కంటెంట్‌ను ఆటోమేటిక్‌గా డౌన్‌లోడ్ చేయడానికి పైథాన్ బాట్స్‌ను ఉపయోగించినట్లు పోలీసులు గుర్తించారు.

### ఆదాయం, నష్టం.. పోలీసుల విచారణ

పాప్-అప్ యాడ్స్, క్రిప్టోకరెన్సీ డొనేషన్ల ద్వారా రవి కోట్లాది రూపాయలు సంపాదించాడు. పోలీసులు ఇప్పటికే అతడి బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.3 కోట్లను ఫ్రీజ్ చేశారు. అతని కార్యకలాపాల వల్ల కేవలం 2024లోనే తెలుగు చిత్ర పరిశ్రమకు రూ.3,700 కోట్లు, భారతీయ సినిమా పరిశ్రమకు మొత్తంగా రూ.24,000 కోట్ల నష్టం వాటిల్లినట్లు అంచనా. గతంలో రవి పోలీసులను హెచ్చరిస్తూ రాసిన లేఖ సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీనిపై నెటిజన్లు "తెలంగాణ పోలీసులతో పెట్టుకుంటే ఇలాగే ఉంటుంది" అంటూ కామెంట్లు చేస్తున్నారు.

2025 ఆగస్టు నుంచి రవి కదలికలపై నిఘా పెట్టిన సైబరాబాద్ పోలీసులు, నవంబర్ 15న హైదరాబాద్ రాగానే అరెస్ట్ చేశారు. ప్రస్తుతం 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న అతడిపై ఇప్పటికే ఏడు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. అతని నుంచి స్వాధీనం చేసుకున్న వందలాది హార్డ్ డిస్క్‌లను, క్రిప్టో ఖాతాలను విశ్లేషిస్తున్నారు. ఈ కేసులో మరింత లోతుగా దర్యాప్తు చేసేందుకు రవిని కస్టడీలోకి తీసుకోవడానికి సోమవారం నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ నెట్‌వర్క్‌లో భాగమైన ఇతర సభ్యుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

# సీసీ రోడ్ పనులు ప్రారంభం



జఫర్గడ్ ప్రతినిధి, నవంబర్ 16 , (తరంగాలు) : మండలంలోని కునూరు గ్రామంలో ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల నుండి స్టేషన్ఘన్పూర్ శాసనసభ్యులు మాజీ ఉప ముఖ్యమంత్రివర్యులు కడియం శ్రీహరి ఆదేశాల మేరకు 5లక్షల రూపాయలతో సిసి రోడ్ వేయడం జరుగుతుంది దీనికిగాను గ్రామస్తులు ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, శ్రీనివాస్, సీనియర్ నాయకులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొనడం జరిగింది.

# ఘనంగా ముగిసిన పర్వతగిరి మండలం బ్లాక్ లెవెల్ క్రీడలు






పర్వతగిరి, (నవంబర్ 15) తరంగాలు : మేరా యువ భారత్ వరంగల్ వారి ఆధ్వర్యంలో నిర్వహించబడిన పర్వతగిరి మండలం బ్లాక్ లెవెల్ క్రీడలు విజయవంతంగా ముగిశాయి. ఈ క్రీడలలో బాలుర కబడ్డీ విభాగంలో తెలంగాణ మోడల్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. ఆదర్శ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి మాట్లాడుతూ.. నిజ జీవితంలో క్రీడలు ఎంతో దోహదపడతాయని, అదేవిధంగా మానసికంగా, శారీరకంగా దృఢత్వాన్ని పెంపొందించడానికి తోడ్పడతాయని అన్నారు. క్రీడలలో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని, అలా చేసినప్పుడే విద్యార్థులు భవిష్యత్తులో ముందడుగు వేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ సురేష్, మేరా యువ భారత్ జిల్లా యూత్ కోఆర్డినేటర్ ధరావత్ రాజేందర్ నాయక్, విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# జల్లి మాజీ సర్పంచ్ కొమురయ్య మృతి

## - నివాళులు అర్పించిన మాజీ ఎమ్మెల్యే పెద్ది



నర్సంపేట నవంబర్ 16 తరంగాలు : చెన్నారావుపేట మండల మాజీ ఎంపీపీ జక్కా అశోక్ తండ్రి జల్లి గ్రామ మాజీ సర్పంచ్ జక్క కొమురయ్య అనారోగ్యంతో మృతి చెందాడు విషయం తెలుసుకున్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆదివారం కొమురయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులు అర్పించారు అనంతరం వారి కుమారుడు మాజీ ఎంపీపీ జక్కా అశోక్ మరియు కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బాల్నే వెంకన్న క్లస్టర్ బాధ్యులు ఆయా మండలాల పార్టీ బాధ్యులు మాజీ ప్రజాప్రతినిధులు ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాల ముగింపు బహిరంగ సభనుజయప్రదం చేయండి



జఫర్గడ్ ప్రతినిధి, నవంబర్ 16, (తరంగాలు) : మండల కేంద్రంలోసిపిఐ ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మండల కార్యదర్శి జువారి.రమేష్పాల్గొని భారత కమ్యూనిస్టు పార్టీ భారత గడ్డపైన పురుడు పూసుకుని నేటికీ 100 సంవత్సరాలు గడుస్తున్న సందర్భంలో మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ స్వాతంత్ర ఉద్యమం నుండి మొదలుకుంటే భారతదేశవ్యాప్తంగా ప్రజల కోసం కార్మిక వర్గం కోసం భూమికోసం భుక్తి కోసం విరోచితమైనటువంటి పోరాటాలు చేసి కొన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వాలను ఏర్పాటు చేసి భారత ప్రజానీకం కోసం ఎందరో కమ్యూనిస్టు యోధులు ఈ భారత గడ్డపైన ప్రాణ త్యాగం చేసి చరిత్రను సృష్టించిన కమ్యూనిస్టు పార్టీ తెలంగాణలో రైతాంగ సాయుధ పోరాటం తో బాంచను దొర అన్న ప్రజలచే బంధు కులు పట్టించి భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించి పేదలకు భూములు ఇచ్చిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు ఈ వంద సంవత్సరాల ఉత్సవాలను డిసెంబర్ 26వ తేదీ నా ఖమ్మం పట్టణంలో 5 లక్షల మంది చే భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయడం ఈ సభకు వేలాదిగా తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల సహాయకార్యదర్శి పెండ్యాల సమ్మయ్య, రైతు సంఘం మండల అధ్యక్షులు ఎండీ యాకుబ్ పాషా, ఎండీ జాఫర్,మంద బుచ్చయ్య, గాడుదుల. రమేష్, బుల్లె సాయులు, గుడికందుల సమ్మయ్య, డి హెచ్ పి ఎస్ జిల్లా అధ్యక్షులు కలకోట ప్రభాకర్, భాస్కర్, తదితరులు కరపత్రాల ఆవిష్కరణలో పాల్గొన్నారు.

# ఆంక్షలు లేకుండా పత్తి కొనుగోలు చేయాలి

- పెండింగ్ ధాన్యం బోనస్ వెంటనే చెల్లించాలి
- సిసిఐ నిబంధనలు సడలించి పత్తి కనుగొని చేయాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి సోమయ్య



జఫర్గడ్ ప్రతినిధి, నవంబర్ 16, (తరంగాలు) : సీసీఐ నిబంధనలు సడలించి వెంటనే పత్తి కొనుగోలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి సోమయ్య పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సిపిఎం పార్టీ శాఖ సమావేశం చిర్ర కుమారస్వామి అధ్యక్షతన సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా సోమయ్య హాజరై మాట్లాడుతూ గత సంవత్సరం పండించిన వరి పంటకు, పూర్తిస్థాయిలో బోనస్ ఇవ్వలేదు, గత సంవత్సరం ఇవ్వవలసిన బోనస్ వెంటనే ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంటకు సమగ్ర మద్దతు ధర లేకపోవడంతో ప్రతి సంవత్సరం రైతు ఆర్థికంగా నష్టపోతున్నాడని వాపోయాడు. 11వ సుంఖాన్ని ఎత్తివేయకుండా, ఆంక్షలు విధించకుండా పత్తిని కనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు శాపంగా మారిన కపాస్ కిసాన్ యాప్ వెనక్కి తీసుకోవాలి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాట సుధాకర్, టౌన్ కార్యదర్శి సాకి నరసింగం , వెంకటేష్, అప్సర్, కుమారస్వామి, ఖాదర్, సుధాకర్, భాష బోయిన అనిల్, నల్ల తీగల శీను, తదితరులు పాల్గొన్నారు.

# తాళ్లపూస పల్లి గ్రామ సమస్యలు పరిష్కరించాలి

- ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేత
- సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గోశాల వెంకన్న
- గ్రామ శాఖ కార్యదర్శి మాద శ్రీనివాస్



కేసముద్రం,మహబూబాబాద్, ప్రతినిధి, నవంబర్ 16, తరంగాలు : కేసముద్రం మండలం తాళ్లపూస పల్లి గ్రామంలో స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం కేసముద్రం మండల కార్యదర్శి గొడిశాల వెంకన్న గ్రామ శాఖ కార్యదర్శి మాద శ్రీనివాస్ ఆధ్వర్యంలో మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళి నాయక్ కి వినతిపత్రం అందజేశారు.నవంబర్ 16 ఆదివారం రోజున తాళ్లపూస పల్లి గ్రామంలో ఎమ్మెల్యేను కలిసి గ్రామ సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు 2023లో పూస పెల్లి ఎస్టి బజార్ నుండి రాజ్య తండా వరకు బీటీ రోడ్డుకు రెండు కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయని శిలాఫలకం వేసి నేటికీ పనులు పూర్తి చేయలేదని గ్రామపంచాయతీ నుండి చెరువు కట్ట మీదుగా మోరి తండా రోడ్డు నిర్మాణం మూడు కోట్లు మంజూరు కాగా నిర్మాణం పూర్తికాలేదని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రహరి గోడ లేక పరిశుభ్రత లోపించి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్థానిక సమస్యలు పరిష్కరించి ప్రజల్ని ఆదుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఎం స్థానిక నాయకులు శేఖర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారిని ఆశీర్వదించిన రాణా ప్రతాప్



నర్సంపేట నవంబర్ 16 తరంగాలు : నర్సంపేట నియోజకవర్గం లోని నల్లబెల్లి మండలం కొండయిలు పల్లి గ్రామానికి చెందిన పెంతల నాగరాజు సుమలత దంపతుల కుమార్తె అనన్య నూతన వస్త్ర ఫల పుష్పాలంకరణ కార్యక్రమం ఆదివారం నిర్వహించగా ఈ కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాప్ రెడ్డి హాజరై చిన్నారిని ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తడుక వినయ్ మండల నాయకులు చిరంజీవి బూత్ అధ్యక్షుడు సుధాకర్ శ్రీకాంత్ తాళ్ల పెల్లి రాము అచ్చ దయాకర్ కొంకిస విగ్నేష్ బానోత్ రమేష్ పల్లకొండ శ్రీను శివ చిలువేరు అన్వేష్ తో పాటు తదితరులు ఉన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశానికి హాజరైన ఎమ్మెల్యే మురళీ నాయక్






కేసముద్రం, మహబూబాబాద్, ప్రతినిధి,నవంబర్. 16 : రంగాలు : ఆదివారం మహబూబాబాద్ నియోజకవర్గంలోని కేసముద్రం మండలం, తాళ్ల పూస పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మించిన కొత్త గృహాలకు లబ్ధిదారుల కుటుంబాలతో కలిసి మహబూబాబాద్ ఎమ్మెల్యే డా. భూక్యా మురళీ నాయక్ పూజ కార్యక్రమాలు నిర్వహించి, గృహ ప్రవేశాలు చేయించారు. సొంత ఇంటి కలను నిజం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, మరిన్ని అర్హులైన కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను అందించేందుకు పథకాన్ని విస్తరిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి డిసిసి ఉపాధ్యక్షులు అంబటి మహేందర్ రెడ్డి, మండల అధ్యక్షులు అల్లం నాగేశ్వరరావు, మాజీ జడ్పిటిసి బండారి వెంకన్న,ఆర్టీవో నెంబర్ రావుల మురళీ, జిల్లా నాయకులు బండారి దయాకర్, కదిరే సురేందర్, జిల్లా నాయకులు, మండల నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, అధికారులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సారెస్పీ 2వ, దశ కాలువకు భీమ్ రెడ్డి నరసింహారెడ్డి పేరును నామకరణం చేయాలి

- ఈనెల 19న జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కరపత్రాలు ఆవిష్కరణ
- ఎం సి పి ఐ యు పార్టీ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న



కేసముద్రం, మహబూబాబాద్, ప్రతినిధి, నవంబర్. 16, తరంగాలు : కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామంలోని రాములవారి గుడి వద్ద ఎంసీపీఐయు పార్టీ ఏఐసీటియు కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎస్సారెస్పీ రెండో దశ కాలువకు భీమ్ రెడ్డి నరసింహారెడ్డి పేరును నామకరణం చేయాలని ఈనెల 19వ తేదీన హైదరాబాదులోని ఇందిరాపార్కు వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంసీపీఐయు పార్టీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు,నల్లగొండ జిల్లాకు చెందిన మాజీ ఎంపీ, అమరజీవి భీమ్ రెడ్డి నరసింహారెడ్డి పేరును ఎస్సారెస్పీ రెండో దశ కాల్వకు నామకరణం చేయాలని అదేవిధంగా సూర్యాపేట జిల్లాకు బి.ఎన్.రెడ్డి పేరు పెట్టాలని,హుస్సేన్ సాగర్ ట్యాంక్ బండ్ మీద కాంస్య విగ్రహం తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టాలని ఆయన అన్నారు. అయితే ఇటీవల సూర్యాపేట జిల్లాకు చెందిన రామిరెడ్డి దామోదర్ రెడ్డి పేరును శ్రీరామ్ సాగర్ రెండో దశ కాలువకు నామకరణం చేస్తానని ఆయన సంతాప సభలో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడం శోచనీయమని అన్నారు. ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పునర్ పరిశీలించాలని కోరుతూ ఈనెల 19వ తేదీన హైదరాబాదులోని ఇందిరాపార్కు వద్ద జరిగే ధర్నాను సబ్బండ వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈనాటి ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు. ఫలుస సంపత్, కంకల శ్రీనివాస్, నూకల లింగస్వామి, సకినాల నరేష్, బట్టు మురళి, కంచ కుమారస్వామి, అంకిరెడ్డి రాంబాబు, ఎండి పాషా, మర్రాల కుమార్,కంచరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు నిర్మాణ పనులను పరిశీలించిన

- మండల పార్టీ అధ్యక్షులు జాటోతు శ్రీనివాస్ నాయక్



పర్వతగిరి, (నవంబర్ 16) తరంగాలు : అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇల్లు నిర్మాణ పనులను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జాటోతు శ్రీనివాస్ నాయక్ పరిశీలించారు. ఈ సంధర్భంగా శ్రీనివాస్ నాయక్ మట్లాడుతూ..మొదటి దశలో 551 ఇల్లు మంజూరు కాగా, వాటిలో 440 ఇల్లు నిర్మాణ దశలో ఉన్నాయని,160 ఇండ్లు బేస్మెంట్ దశలో, 126 దర్వాజా లెవెల్, 105 స్లాబ్ లెవల్ మరియు మిగతావి గృహప్రవేశాలకు సిద్ధంగా ఉన్నాయని శ్రీనివాస్ నాయక్ తెలిపారు. ప్రజా నాయకుడు శా-సనసభ్యులు కేఆర్ నాగరాజు ఆధ్వర్యంలో అనేక రకాల సంక్షేమ పథకాలు ప్రజా ప్రభుత్వం అందిస్తున్నదని, 27 కోట్ల 50 లక్షలు రూపాయలతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, పేదలకు ఉచిత సన్నబియ్యం, ఆడవారికి ఉచిత బస్సు ప్రయాణం, వడ్డీ లేని రుణాలు, ఉచిత కరెంటు, రైతు సంక్షేమం కోసం రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, 500 రూపాయల బోనస్ ఇలా అనేక రకాలుగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని, ఈ ప్రజా ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు పెద్దపీట వేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రెండోదశలో శాసనసభ్యులు నాగరాజు మరో 500 పైచిలుకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తామని హామీ తో మండల ప్రజలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు శాసనసభ్యులు కె ఆర్ నాగరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో మరెన్నో సంక్షేమ పథకాలు వచ్చే విధంగా మేము పనిచేస్తామని, గత ప్రభుత్వం, నాయకులు ఈ ప్రాంత అభివృద్ధి కోసం, ప్రజల కోసం, పేద వర్గాల కోసం ఏనాడు పనిచేయలేదని అన్నారు. ఈ ప్రజా ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసమే పని చేస్తుందని,ఎవరు కూడా అధైర్య పడవద్దని, ప్రతి అర్హునికి సంక్షేమ పథకాలు అందించటమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నదని శ్రీనివాస్ నాయక్ అన్నారు.

# 17 న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని బయలుదేరిన ఎమ్మార్పీఎస్ నాయకులు

సంగెం సెప్టెంబర్ 16 తరంగాలు : పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు రేపు 17 న జరుగు చలో ఢిల్లీ దళితుల ఆత్మగౌరవ మహా ప్రదర్శన ర్యాలీలో పాల్గొనడానికి డిల్లీకి బయలుదేరడం ఎమ్మార్పీఎస్ మండల నాయకులు ఈ సందర్భంగా మండల ఎమ్మార్పీఎస్ కార్యదర్శి కోడూరు రాజు మాదిగ, గుండేటి బాబు మాదిగ మాట్లాడుతూ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గావాయైప్ జరిగిన దాడికి పాల్పడిన వ్యక్తిపై ఇప్పటివరకు చర్యలు తీసుకోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు ఈ సందర్భంగా మండలం తరఫున నిరసన తెలుపడానికి ఢిల్లీకి బయలుదేరిన ఎమ్మార్పీఎస్ నాయకులు కోడూరు రాజు మాదిగ సంగెం మండల ప్రధాన కార్యదర్శి, గుండేటి బాబు మాదిగ, సదిరం రవికుమార్ మాదిగ, చిర్ర బిక్షపత్తి మాదిగ, చిర్ర హాభిషేకు మాదిగ,చిర్ర గణేష్ మాదిగ. తదితరులు పాల్గొన్నారు



# కేటీఆర్ కు అధికారం కోల్పోయినా.. అహంకారం తగ్గలేదు

- వరంగల్ కాంగ్రెస్ సేవ దళ్ అధ్యక్షులు నకరకంటి మోహన్



హన్మకొండ ప్రతినిధి, నవంబర్ 16, తరంగాలు : కేటీఆర్ కు అధికారం కోల్పోయినా అహంకారం తగ్గలేదని అందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై, కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని వరంగల్ కాంగ్రెస్ సేవ దళ్ అధ్యక్షులు నకరకంటి మోహన్ అన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. కేటీఆర్ అహంభావంతో మాట్లాడటం సరికాదని సూచించారు. దేశానికే ఆదర్శవంతమైన పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న బియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇల్లు,మహాలక్ష్మి పథకం, 21 వేల కోట్ల రుణ మాఫీ, సన్నాలకు 500 బోనస్ వంటి పథకాలు కేటీఆర్ కళ్ళకు కనిపించడం లేదా అని విమర్శించారు. ఉద్యమం చేసిన పార్టీ అని ప్రజలు రెండు సార్లు అధికారం ఇస్తే కల్వకుంట్ల కుటుంబం తెలంగాణ పైన పడి దోచుకున్నారని ఆరోపించారు.తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు కల్వకుంట్ల కుటుంబం ఆస్తులు ఎన్ని....ఇప్పుడు ఉన్న ఆస్తులు ఎన్నో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ ముందుగా తన చెల్లి కవిత అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. ఇంట్లో కుటుంబ సభ్యులనే ఒప్పించలేని స్థితిలో కేటీఆర్ ఉన్నాడని అన్నారు. కేటీఆర్ ముందు నీ ఇంటి వ్యవహారం చక్కదిద్దుకోని ఆతర్వాత ఇతరులను విమర్శించాలని సలహా ఇచ్చారు.ఎస్సీ, ఎస్టీ, బీసీలు గెలిస్తే కేటీఆర్ ఓర్చుకోలేకపోవడం విచిత్రంగా ఉందన్నారు. బడుగు, బలహీన వర్గాలంటే అంత అలుసా.. అని ప్రశ్నించారు. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ తప్పిదాలపై విచారణ జరుగుతోందని, త్వరలోనే అందరి లెక్కలు తేల్చుతామని హెచ్చరించారు. కేసీఆర్ ఫ్యామిలీ దొంగ జిమ్మిక్కులను ప్రజలంతా గమనిస్తున్నారని హెచ్చరించారు.

# టెక్స్టైల్ ఇంజనీరింగ్ కాలేజ్ ఏర్పాటు చేయాలి









వరంగల్ ప్రతినిధి, నవంబర్ 16, తరంగాలు : వరంగల్ జిల్లాలో టెక్స్టైల్ డిజైనర్ ఇంజనీరింగ్ కాలేజ్ ఏర్పాటు చేయాలని అఖిలభారత పద్మశాలి సంఘం పూర్వ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర ఖాదీ చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం అన్నారు. ఆదివారం ఖిలా వరంగల్ వాకింగ్ మైదానంలో జరిగిన పద్మశాలీల కార్తీక వనభోజనాల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఈగ మల్లేశం హాజరై శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈగ మల్లేశం మాట్లాడుతూ టెక్స్టైల్ డిజైనర్ ఇంజనీరింగ్ కాలేజీ. కేవలం గుజరాత్ రాష్ట్రంలో ఉందని, వరంగల్ జిల్లాలో టెక్స్టైల్ డిజైనర్ ఇంజనీరింగ్ కాలేజీ నెలకొల్పడం వల్ల ఈ ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. వనభోజనాల వలన పద్మశాలీలలో స్నేహభావం పెరగడంతో పాటు సమస్యలు తెలుస్తాయన్నారు. పద్మశాలీల సమస్యలపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు గతంలో అనేకసార్లు విన్నవించిన పరిష్కారం కాలేదన్నారు. వరంగల్ జిల్లాలోని కాకతీయ మెగా టెక్స్టైల్ పార్కులో చదువుకున్న పద్మశాలి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. పద్మశాలీలలో వలసలు ఆగలేదని, ఇప్పటికీ అనేకమంది భీమండి, సూరత్, గుజరాత్ లాంటి ప్రాంతాలకు వలస వెళ్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సాధించి వలస కార్మికులను స్వరాష్ట్రం తీసుకువచ్చి ఉపాధి కల్పించాలన్నారం. పద్మశాలీలతో పాటు ఇతర కులస్తులు కార్తీక మాస వనభోజనాలకు రావడం సంతోషంగా ఉందన్నారు. మన సంస్కృతి సాంప్రదాయాలను నేటి తరానికి చెప్పవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పద్మశాలీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కలుస్తామన్నారు.

## ఎస్సై సాయిబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కుల్ల యాకాంతం



వర్ధన్నపేట, నవంబర్ 15,తరంగాలు : వర్ధన్నపేట ఎస్సై సాయిబాబు కు యువజన కాంగ్రెస్ అసెంబ్లీ సోషల్ మీడియా కోఆర్డినేటర్, మండల ఉపాధ్యక్షుడు కుల్ల యాకాంతం జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదివారం వర్ధన్నపేట ఎస్సై సాయిబాబు పుట్టినరోజు సందర్భంగా వర్ధన్నపేట పోలీస్ స్టేషన్ కార్యాలయంలో ఎస్ ఐ ని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ సోషల్ మీడియా కోఆర్డినేటర్, మండల ఉపాధ్యక్షుడు కుల్ల యాకాంతం మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్సై సాయిబాబు తో కేక్ కటింగ్ చేయించి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చిన్నాల దేవేందర్, సంకినేని గంగరాజు, బొల్లం కుమార్, చిదుముల్ల నాగరాజు తదితరులు ఉన్నారు.

## వర్ధన్నపేట ఎస్సై సాయిబాబుకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన

- ఏఎంసీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, మండల అధ్యక్షులు ఎద్దు సత్యనారాయణ, జిల్లా నాయకులు పోశాల వెంకన్న గౌడ్




వర్ధన్నపేట ప్రతినిధి, నవంబర్ 16,తరంగాలు : వర్ధన్నపేట సబ్-ఇన్స్పెక్టర్ సాయిబాబా జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఎద్దు సత్యనారాయణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు పోశాల వెంకన్న గౌడ్,ఇల్లంద కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు ఎద్దు రాజేంద్ర ప్రసాద్ ఎస్సై ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సై సాయి బాబుకు మిఠాయి తినిపించి, శాలువా కప్పి ఘనంగా సన్మానం చేసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## మద్నూర్ గురుకుల విద్యార్థుల క్రీడా ప్రతిభ



తరంగాలు న్యూస్, మద్నూర్ నవంబర్ 16 : కామారెడ్డి జిల్లా మద్నూరు మండల తెలంగాణ గురుకుల బాలుర విద్యాలయం మరియు జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు అండర్ 17 ఖో ఖో,అండర్ 14 ఖో ఖో పోటీల్లో జిల్లా స్థాయి క్రీడా ప్రతిభను చూపారని ప్రిన్సిపాల్ సుధాకర్, వ్యాయామ ఉపాధ్యాయులు జాదవ్ గణేశ్ లు తెలిపారు.కామారెడ్డి ప్రధాన నగరములో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్ 17 ఖోఖో లో గోతి జగదీశ్, జవహర్ సింగ్, సి.హెచ్ జ్ఞానేశ్వర్, కే.బాలాజీ, బి రామకృష్ణ, అండర్ 14 ఖోఖో లో డోవెగ్ర రమేశ్, యం.సాయితేజ, సి హెచ్ అర్జున్, కే.నవదీప్ లు జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమ, ద్వితీయ బహుమతులను జిల్లా విద్యాశాఖాధికారి రాజు, యస్ జీ ఎఫ్ అధికారి హీరాలాల్ చేతులమీదుగా అందుకున్నట్లు చెప్పారు. ఈ విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ప్రముఖ పద్యకవి వ్యాఖ్యాత డా బి.వెంకట్, సుధాకర్, గణేశ్, పీ బీ నాగరాజు, రక్షకుడు ప్రవీణ్ కుమార్, ఉపాధ్యాయులు సుమన్, వేణుగోపాల్, సంతోష్, నరహరి ప్రసాద్, రాము, సంజు, దత్తు, గంగా ప్రసాద్, తదితరులు విద్యార్థులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

# పేదల సొంతింటి కల కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యం

- ఇందిరమ్మ ఇళ్ల నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు





వరంగల్ ప్రతినిధి, నవంబర్ 15,తరంగాలు : పేదల సొంతింటి కల కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యం అని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 45వ డివిజన్ పరిధిలోని కుమ్మరిగూడెం గ్రామ నివాసి మొట్ల శిరీష %-% కిషన్ దంపతులు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ప్రభుత్వంనుంచి కేటాయించిన రూ.5 లక్షల ఆర్థికసహాయంతో గృహ నిర్మాణాన్ని పూర్తిచేసుకున్నారు. గృహప్రవేశ కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కే.ఆర్. నాగరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి గృహాన్ని ప్రారంభించారు.అనంతరం ఎమ్మెల్యే నాగరాజు కుటుంబ సభ్యులకు వస్త్రాలు అందించి ఆశీర్వదించారు. గ్రామ ప్రజలతో మాట్లాడిన ఆయన, పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ప్రయోజనాలు ఇలాంటి కుటుంబాలకు చేరడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.తదనంతరం గ్రామంలో ఎస్సీ కాలనీలలో పర్యటించి అంతర్గత రోడ్లు డ్రైనేజీ సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా ఎన్నో పథకాలు అమలు చేస్తోంది. ముఖ్యంగా గృహరహితులకు ఇళ్లు కల్పించేందుకు భారీగా నిధులు కేటాయించడం ద్వారా వేలాది కుటుంబాలకి సొంతిల్లు కలనే నిజం అవుతోంది. ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణంలో నాణ్యతతో పాటు వేగవంతంగా పనులు పూర్తి చేసేలా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు కృషి చేయాలి. లబ్ధిదారులు కూడా ప్రభుత్వం అందించిన సాయం సద్వినియోగం చేసుకొని అభివృద్ధి దిశగా ముందుకు సాగాలి అన్నారు.అలాగే గ్రామాభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణకు సమగ్ర ప్రణాళికతో పనిచేస్తామని, ప్రతి ఇంటి సమస్యను గుర్తించి పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే నాగరాజు తెలిపారు. గృహ ప్రవేశం చేసిన శిరీష%-%కిషన్ దంపతులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఐ సాయిబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బిఆర్ఎస్ నాయకులు



వర్ధన్నపేట ప్రతినిధి, నవంబర్ 16,తరంగాలు : వర్ధన్నపేట మండల సబ్ ఇన్స్పెక్టర్ ఎన్.సాయిబాబుకు వర్ధన్నపేట బిఆర్ఎస్ నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఆదివారం వర్ధన్నపేట ఎస్సై సాయిబాబు పుట్టినరోజు సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు ఎస్సై తో కేక్ కటింగ్ చేయించి, శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు తుళ్ల కుమారస్వామి, పట్టణ అధ్యక్షులు గోధుమల మధుసూదన్,మాజీ ఎంపీపీ అన్నమనేని అప్పారావు,మాజీ జెడ్పిటిసి మార్గం బిక్షపతి,మాజీ దేవస్థానం చైర్మన్ ఏరుకొండ వేణుగోపాల్ రావు, మాజీ ప్రధాన కార్యదర్శి కొండేటి శ్రీనివాస్,మాజీ దేవస్థానం చైర్మన్ సిల్వేరు కుమారస్వామి, సీనియర్ నాయకులు తుమ్మల యాకయ్య, మాజీ సర్పంచులు పెంచాల కుమార స్వామి,కర్ర.వెంకటరెడ్డి,పట్టణ యువత అధ్యక్షులు తిరుపతి సురేష్,మాజీ ఎంపీటీసీ మార్తసారంగపాణి, మైనారిటీ నాయకులు ఎండి రహీం,మాజీ అధ్యక్షులు యాకర సందీప్,నాయకులు పిట్టల రాజు, కౌన్సిలర్ బానోత్ శ్రీనివాస్,యూత్ అధ్యక్షులు శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.

## భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాలు సందర్భంగా ముగింపు ఉత్సవాలు



తరంగాలు న్యూస్, జోగులాంబ గద్వాల్ జిల్లా, ( ఇటిక్యాల ), నవంబర్ 16 : భారత కమ్యూనిస్టు పార్టీ ( సిపిఐ ), 1925 డిసెంబర్ 26వ తేదీన ఏర్పడి 100 సంవత్సరాల సందర్భంగా. ముగింపు ఉత్సవాలు 20 25 డిసెంబర్ 26 న ఖమ్మంలో బహిరంగ సభ ద్వారా( సిపిఐ )ఉత్సవాలు జరుగుతాయని భారత కమ్యూనిస్టు పార్టీ నాయకులు తెలుపుతున్నారు. నవంబర్ 15వ తేదీన గద్వాల్ లో కళాజాత ద్వారా ప్రారంభమై,ఎంపిక చేసిన జిల్లాలలో నుండి కొత్తగూడెం వరకు ప్రచార జాతరను నిర్వహిస్తున్నట్లు భారత కమ్యూనిస్టు పార్టీ నాయకులు ప్రకటించారు. భారత కమ్యూనిస్టు పార్టీ ( సిపిఐ ) 100 సంవత్సరాలు సందర్భంగా రాష్ట్రస్థాయి బస్సు యాత్ర నిర్వహించే కార్యక్రమాన్ని జోగులాంబ గద్వాల్ జిల్లా కేంద్రం పాత బస్టాండ్ ఆవరణలో శనివారం, సిపిఐ జాతీయ కార్యదర్శి మాజీ ఎంఎల్ఏ పల్ల వెంకట్ రెడ్డి, సిపిఐ పార్టీ ఎం.ఎల్.సి నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాల నరసింహులు తదితరులు సిపిఐ నాయకులు ముఖ్య అతిథులుగా హాజరై బస్సు జాతరను జెండా ఊపి ప్రారంభించారు. పాత బస్టాండ్ ఆవరణలో నిర్వహించిన బహిరంగ సభ సిపిఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ బ్రిటిష్ వారి పాలన నుండి విముక్తి చేసినది, సామాన్య ప్రజల కోసం, పేద ప్రజల కోసం, రైతులు కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పోరాటం చేయడం జరుగుతుందని సిపిఐ పార్టీ జాతీయ రాష్ట్ర స్థాయి నాయకులు మాట్లాడారు. భూస్వామి వ్యవస్థ అంతం చేయాలని, భారత కమ్యూనిస్టు ( సిపిఐ) పార్టీ ఎప్పటికీ పోరాటం చేస్తుందని దున్నేవాడిదే భూమి అని, ప్రజలను వెట్టిచాకిరి నుండి విముక్తి చేసిన ఘనత అని, భూములను దానం చేసిన ఘనత భారత కమ్యూనిస్టు ( సిపిఐ) పార్టీది అని సిపిఐ పార్టీ నాయకులు తెలియజేశారు. భవిష్యత్తులో ప్రజల కోసం ఉద్యమాలు చేస్తామని దేశాన్ని సమైక్యంగా నిర్మించేందుకు, భారత కమ్యూనిస్టు సిపిఐ పార్టీ 100 ఏళ్ల సందర్భంగా బస్సు జాతర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సిపిఐ నాయకులు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో నుండి అన్ని ప్రాంతాల నుండి వచ్చే ప్రజల ద్వారా భారీ బహిరంగ సభను డిసెంబర్ 26వ తేదీన ఖమ్మం జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు సిపిఐ పార్టీ నాయకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సిపిఐ నాయకులు ఆశన్న, రంగన్న తదితరులు. వివిధ నాయకులు నాగర్ దొడ్డి వెంకట్ రాములు మధుసూదన్ బాబు, కురువపల్లయ్య , ప్రభాకర్ ,వెంకటస్వామి, మోహన్ రావు, పెద్ద చిన్న గౌడ్, సుభాన్, చెన్నయ్య, రవి, నాగార్జున పరమేశ్, ప్రవీణ్, వీరేష్, భగత్ గురు స్వామి, భీమేష్ తిరుమలేష్, నారాయణ, కురువజనేయులు, ప్రభుదాస్ తిమ్మప్ప, మస్తాన్, వెంకట్, రాములు తదితర వారు పాల్గొన్నారు.

# కుంట కుటుంబాన్ని పరామర్శించిన పసుపు బోర్డు ఛైర్మన్ పల్లె గంగారెడ్డి



తరంగాలు న్యూస్, మోర్తాడ్, నవంబర్ 16 : మోర్తాడ్ మండలం పాలెం గ్రామానికి చెందిన బీజేపీ మండల ఉపాధ్యక్షుడు కుంట శ్రీనివాస్ రెడ్డి నాయనమ్మ ఇటీవల మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అదివారం పసుపు బోర్డు ఛైర్మన్ గౌరవ పల్లె గంగారెడ్డి పాలెం గ్రామానికి చేరుకొని కుంట శ్రీనివాస్ రెడ్డి, కుంట గంగ రెడ్డి, పిప్పెర రామ్ రెడ్డి కుటుంబ సభ్యులను వారి నివాసంలో పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, ఈ కష్ట సమయంలో పార్టీ తరఫున పూర్తి అండగా ఉంటామని పల్లె గంగారెడ్డి హామీ ఇచ్చారు. ఆయనతో పాటు బీజేపీ జిల్లా కార్యదర్శి సంఘం అనిల్‌కుమార్, బీజేపీ ఆర్మూర్ పట్టణ మాజీ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్, కిసాన్ మోర్చా మోర్తాడ్ మండల ఉపాధ్యక్షుడు శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇంద్రధనస్సు మధ్య ఓ ప్రేమ జంట పెండ్లి



తరంగాలు న్యూస్, నిజామాబాద్, నవంబర్16 : జిల్లా నిజామాబాద్ సిరికొండ మండలం నర్సింగపల్లి గ్రామానికి చెందిన కాయితా ప్రభుదాస్, దినమ్మల కుమారుడు వికాస్ వివాహం నిషితా కర్ణాటకలోని మంగళూరుకు చెందిన అమ్మాయితో ప్రేమ వివాహం జరిగింది. గురువారం కోర్టు మేరేజి అనంతరం శనివారం రిసెప్షన్ సెరిమోని మహారాష్ట్ర మాజీ సీఎం గారి ప్రభాదేవి లోగల కోహినూర్ హాల్లో వైభవంగా సాగింది. వీరు ముంబైలోనే పుట్టి పెర్గారు. ఇరువురు ఉన్నత చదువులు ఉద్యోగ విధులు నిర్వహిస్తున్నారు. వధూవరుల నిజమైన ప్రేమకు ఈ పెండ్లి ఓ తార్కణం. నేషనలిజానికి ప్రతీక. వీరి పెండ్లిలో యూపీ, బీహార్, ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, పంజాబ్, గోవా మొదలగు రాష్ట్రాల ప్రజలు హాజరవ్వడం సంతోషకరం. ముంబై మహానగరం వైవిధ్యంతో కూడిన ఇంద్రధనస్సు లాంటి సాంప్రదాయాలతో కళాకాలడోతుంది. ఏ ధార్మిక ఆధిపత్యం లేకుండా భారతీయ చట్టపరంగా సర్వ సుసమ్మతితో వీరి లగ్నం నెరవేరింది. పెండ్లిలో హిందువు క్రైస్తవ ముస్లిం జైన్ బుద్దిస్టులు కల్సి అందమైన ప్రేమ జంటకు మనసారా ఆశీస్సులు వెదజల్లారు. ఇందులో పాస్టర్ అబ్బా ప్రభుదాస్, పాస్టర్ బి. విలియం, అడ్వకేట్ తలారి ప్రభుదాస్, నిరండి కాంతయ్య, అరగండి ప్రసాద్, ఎంటిబిఎఫ్ నేతలైన జంబూక ఆనంద్, గన్నారపు శంకర్, మాలజీ సార్, ఏవైఎస్ ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షులు తలారి ఆనంద్, నిజామాబాద్ జర్నలిస్ట్ ఎస్.రాజేష్ (అమోస్) పాల్గొనడం విశేషం.

# పేరుకే హాస్టల్స్... వార్డెన్లు ఎక్కడ?






తరంగాలు న్యూస్, మణుగూరు నవంబర్ 16 : మండలం సమితి సింగారం పంచాయతీ పరిధిలోని పలువురు హాస్టల్స్‌లో సామాజిక కార్యకర్త, న్యాయవాది కర్నే రవి ఆదివారం శుభ్రత పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా హాస్టల్స్ ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏజెన్సీ మా-రుమూల ప్రాంతాల నుండి తల్లిదండ్రులు తమ పిల్లలను భరోసాతో హాస్టల్స్‌కు, పంపుతున్నారని, అయితే, ఆదివారం ,పండుగలు వచ్చినప్పుడల్లా వార్డెన్లు ముందురోజే హాస్టల్స్‌ను ఖాళీ చేసి ఎక్కడికో వెళ్లిపోవడం చాలా బాధాకరం, విచిత్రమని పేర్కొన్నారు. అటెండెన్స్ రిజిస్టర్‌లో మాత్రం అన్ని రోజులు సంతకాలు ఉండటం ఆశ్చర్యకరమని, కానీ గ్రౌండ్ రియాలిటీగా హాస్టల్ ప్రాంగణంలో వార్డెన్లు కనిపించకపోవడం తీవ్రమైన నిర్లక్ష్యమని విమర్శించారు. వార్డెన్ల పర్యవేక్షణ లేకపోవడంతో పిల్లలు తమ ఇష్టానుసారం హాస్టల్‌లో తిరుగుతున్నారని, ఏదైనా అపశృతి జరిగినట్లయితే దానికి బాధ్యత వహించే వారు ఎవరు? అంటూ ప్రశ్నించారు. అదే విధంగా పిల్లలకు సరైన ఆహారం కూడా అందించడం లేదని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఐ టి డి ఏ పీ, ఏ పీ ఓ లు, జిల్లా కలెక్టర్, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు వెంటనే స్పందించి, వార్డెన్లపై తగిన విచారణ జరిపి, పిల్లల భద్రత, సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని కర్నే రవి విజ్ఞప్తి చేశారు.

# పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- దుగురి పై కేసు నమోదు
- రూ.23500 నగదు, 3సెల్ ఫోన్లు, బైక్ స్వాధీనం
- కారేపల్లి ఎస్ఐ గోపి



తరంగాలు న్యూస్, కారేపల్లి నవంబర్ 16 : ఖమ్మం జిల్లా కారేపల్లిలో పేకాట ఆడుతున్న విశ్వసనీయ సమాచారం మేరకు కారేపల్లి మండలంలోని సూర్యా తండా గ్రామ శివారులో పేకాట స్థావరంపై కారేపల్లి పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించడం జరిగిందని కారేపల్లి ఎస్సై గోపి తెలిపారు. పేకాట ఆడుతున్న వారి నుంచి రూ. 23500 నగదు, మూడు సెల్ ఫోన్లు, ఒక బైక్ ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పేకాట ఆడుతున్న వారిలో ఇద్దరు పరార్ కాగా ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. పేకాట ఆడుతున్న వారి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపి తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ తో పాటు పోలీస్ సిబ్బంది ఓంకార్, వెంకన్న, సైదులు పాల్గొన్నారు.

# వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే షిండే



తరంగాలు న్యూస్, మద్నూర్ నవంబర్ 16 : కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం నిజాంపేట్ లోని నాగమ్స్ యన్ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్లో ఆదివారం కాంట్రావుపల్లి శ్రీనివాస్ గౌడ్ కుమార్తె వివహం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే నియోజకవర్గ నాయకులు హాజరై నూతన ఆశీర్వదించారు వధూవరులకు ఆశీర్వదించారు. వారి భవిష్యత్తు దాంపత్య జీవితం ప్రేమ, ఆనందం, ఐశ్వర్యంతో నిండిపోవాలని హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిచ్కుంద మాజీ మార్కెట్ ఛైర్మన్ నాల్చర్ రాజు, సొసైటీ ఛైర్మన్ నాల్చర్ బాలాజీ నర్స గౌడ్, రాజ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించిన కోదండపూర్ ఎస్ఐ





తరంగాలు న్యూస్, కోదండపూర్ , ( ఇటిక్యాల ), నవంబర్ 16 : జోగులాంబ గద్వాల్ జిల్లా కోదండపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 44వ జాతీయ రహదారి సమీపంలో ఉన్న ఒక పెట్రోల్ డీజిల్ బంకు దగ్గర, ఆదివారం సాయంత్రం కోదండ పూర్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ కే మురళి డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా పోలీస్ స్టేషన్ పరిధిలోని పెట్రోల్ బంక్ డీజిల్ బంకుల దగ్గర డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాన్ని ఎస్ ఐ కే మురళి నిర్వహించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ రంగరాముల గుట్టపై సామూహిక సత్యనారాయణ వ్రతాలు

## అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు









తరంగాలు న్యూస్, పటాన్చెరువు : జిన్నారం మున్సిపాలిటీలోని శ్రీ రంగరాముల గుట్టపై సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. చిన్న పెద్ద తేడా లేకుండా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. గత 12 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న సామూహిక సత్యనారాయణ వ్రతాలను ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా కార్తీక మాసాన్ని పురస్కరించుకుని. కొనసాగించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు

# వ్యవసాయ & సహకార శాఖ తుమ్మల నాగేశ్వరావుని కలిసి మధిర కమ్మవారి వన మహోత్సవానికి ఆహ్వానించిన మధిర కమ్మ సంఘం కమిటీ



తరంగాలు న్యూస్, మధిర నవంబర్ 16, ఖమ్మం జిల్లా : ఈ నెల 19 వ తేదీన ఆత్కూరు అబ్బురి వారి మామిడి తోటలో బుధవారం జరగనున్న కమ్మవారి వనమహోత్సవం కార్యక్రమానికి రావలసిందిగా మంత్రి తుమ్మల నాగేశ్వరావు ను మధిర కమ్మ సంఘం తరఫున ఆహ్వాన పత్రికను అందించి ఆహ్వానించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరావు ను ఆహ్వానించిన వారిలో పుతుంబాక శ్రీకృష్ణ ప్రసాద్, కరివేద వెంకటేశ్వరరావు,కరివేద సుధాకర్,చెరుకూరి నాగార్జున, చెరుకూరి కృష్ణారావు, తన్నీరు రామకృష్ణ లు ఉన్నారు. మధిర కమ్మ సంఘం ఆహ్వానానికి స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఈ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరవుతానని మాటిచ్చారు.

# సర్వ సమానత్వం కోసం ఉద్యమిస్తున్న పార్టీ బిఎస్పి

- బీఎస్పీ అధికారంలోకి రావడం ద్వారానే బహుజన జాతుల అభివృద్ధి జరుగుతుంది
- బీఎస్పీ భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షులు కొండా చరణ్



తరంగాలు న్యూస్, చర్ల, నవంబర్ 16 : చర్ల మండల కేంద్రంలోని బీఎస్పీ పార్టీ మండల కార్యాలయంలో అత్యవసర సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి పార్టీ భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షులు కొండాచరణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా చర్ల నివాసులు పడిగల వెంకటేశ్వర్లు బీఎస్పీ పార్టీలో చేరిక జరిగింది.కొండా చరణ్ పడిగల వెంకటేశ్వర్లుకి పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించడం జరిగింది. పడిగల వెంకటేశ్వర్లు పార్టీలోకి రావడం ఎంతో శుభ పరిణామమని అన్నారు. పడిగల వెంకటేశ్వర్లుకి పార్టీ నిరంతరం అండగా ఉంటుందని తెలిపారు. పడిగల వెంకటేశ్వర్లు బిఎస్పి లో చేరడం బహుజన చైతన్యానికి నిదర్శనమని ఈ చేరిక బహుజనులైన ఎస్సీ ఎస్టీ బీసీ మత మైనారిటీల ఐక్యతకు ఎంతగానో దోహదపడుతుందని సర్వజనహితాయ సర్వజన సుఖాయ అనే నినాదంతో, సమాజంలో ఎవరు ఎంతో వారికి అంత వాటా దక్కాలి అనే నినాదం, లక్ష్యంతో వెంకటేశ్వర్లు కృషి చేస్తారని ఆశిస్తున్నామని అన్నారు. బీఎస్పీ అధికారంలోకి రావడం ద్వారానే భద్రాచల నియోజకవర్గ,బహుజన జాతుల అభివృద్ధి జరుగుతుందని అన్నారు. సర్వ సమానత్వం కోసం పనిచేస్తున్న బీఎస్పీ నాయకత్వానికి ప్రజలందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. చర్ల మండలంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి బీఎస్పీ నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. ఈ సమావేశంలో చెన్నం మోహన్, ఎస్కే జహీరుద్దీన్ భాష,పార్టీ నాయకులు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యం లో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకం

- తెలంగాణ జర్నలిస్ట్ మీడియా యూనియన్ వ్యవస్థాపక,రాష్ట్ర అధ్యక్షులు ఐ ప్రభాకర్.



తరంగాలు న్యూస్, హైదరాబాద్, నవంబర్ 16 : ప్రజాస్వామ్యం లో ఫోర్త్ ఎస్టేట్ గా ప్రసిద్ధి చెందిన పాత్రికేయరంగం ఎంతో ప్రాధాన్యత సంతరించుకుందని ఇందులో జర్నలిస్టుల పాత్ర కీలకమని సీనియర్ జర్నలిస్ట్ చార్మినార్ న్యూస్ ఎడిటర్ ఐ ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 16 జాతీయ జర్నలిజం దినోత్సవం సందర్భంగా సమాజం లో దీని విశిష్టత ను ఈ పత్రికా ప్రతినిధి కి ఆయన తెలియజేసారు. ఆధునిక ప్రపంచంలో జర్నలిస్టులు శక్తివ%శీ%తమైన భూమిక పోషిస్తా-రనీ. వ్యవస్థలు సక్రమంగా కొనసాగటానికి పారదర్శకత, జవాబుదారితనం అవసరంనీ. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధి గా వుంటూ సమస్యల సాధన లో తమ వంతు కృషి చేస్తూ నిరంతరం పాత్రికేయరంగంలో అలుపెరుగని పోరాటం చేస్తున్నదనీ. జర్నలిస్టులను మిర్రర్ ఆఫ్ సొసైటీ గా అభివర్ణిస్తారనీ. కేవలం వార్తలు అందించటమే కాకుండా సమస్యల పరిష్కారం కై వివిధ సూచనలు చేయడం. సామాజిక , ఆర్థిక , రాజకీయ, విద్యావిషయక, సాంకేతిక , ఆరోగ్యసంబంధిత, ఇతర అనేక అంశాలను జనసామాన్యానికి అర్థమయ్యే భాష లో చైతన్యపరచడం. ప్రభుత్వం పనితీరు ను వాచ్ డాగ్ గా నిరంతరం జాగరూకత తో పరిశీలిస్తూ అర్హులైన వారికి పథకాలు అందటం లో అత్యంత ప్రముఖ పాత్ర పోషిస్తారు కనుక ఈ రంగాన్ని ఫోర్త్ ఎస్టేట్ గా వ్యవహరిస్తారనీ. బాధ్యతాయుత పాత్రికేయ రంగం, ఇందులో జర్నలిస్టుల క్రియాశీలత ను ప్రజలకు తెలియజేయటానికి ఈ దినోత్సవం ఉపయోగ పడుతుందని, రానున్న సమాజం లో " జర్నలిజం " ఉజ్వల భవిష్యత్ కలిగివుంటుందని వారు ఆకాంక్షించారు.

# నగరాల అభివృద్ధి, సంక్షేమంతో పాటు వారి అభ్యున్నతికి కృషి చేస్తాను.





తరంగాలు న్యూస్, విజయవాడ, నవంబర్ 16 : కార్తీక మాసంలో చేసే పూజ కార్యక్రమాలు వల్ల ఎంతో పుణ్యఫలం లభిస్తుంది. ప్రజలందరూ ఒక చోట కలిసి భోజనం చేయటం ఐక్యతకు చిహ్నమని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ నగరాల యువజన సంఘం ఆధ్వర్యంలో జక్కండపూడి పాములకాలవ దగ్గర నగరవనం అటవీ శాఖ పార్క్ ప్రాంగణంలో ఆదివారం వనసమారాధన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీ కేశినేని శివనాథ్ ముఖ్యఅతిథిగా హాజరై పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆంధ్ర ప్రదేశ్ నగరాల యువజన సంఘం నాయకులు ఎంపీ కేశినేని శివనాథ్ కు ఘన స్వాగతం పలికారు. అలాగే ఎంపీ కేశినేని శివనాథ్ ను సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన చిన్నారుల నృత్య ప్రదర్శనను ఎంపీ కేశినేని శివనాథ్ అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీకేశినేని శివనాథ్ మాట్లాడుతూ నగరాల వనసమారాధనలో పాల్గొనటం ఎంతో ఆనందంగా వుందన్నారు. నగరాల అభివృద్ధి, సంక్షేమంతో పాటు వారి అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ నగరాల యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాయిన బెనర్జీ, ప్రధాన కార్యదర్శి వి.శ్రవణ్ కుమార్, ఎన్టీఆర్ జిల్లా ఆంధ్ర ప్రదేశ్ నగరాల యువజన సంఘం అధ్యక్షుడు గూడెల మణికంఠ, సంఘం నాయకులు రాయన అరుణ్ కుమార్, విజయవాడ కనకదుర్గమ్మ ఆలయం బోర్డ్ మెంబర్ సుఖాసి సరిత, ఎపీ నగరాల సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్లు సుఖాసి కిరణ్, బేవర సాయి సుధాకర్, పశ్చిమ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు ఆర్.మాధవ, చిట్టినగర్ దేవస్థానం సభ్యులు, ఆంధ్ర ప్రదేశ్ నగరాల యువజన సంఘం సభ్యులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ శ్రీనివాస ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సర్వైకల్ క్యాన్సర్ మెడికల్ క్యాంపు





తరంగాలు న్యూస్, పీలేరు, నవంబర్ 16 : శ్రీ శ్రీనివాస చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ వారి ఆర్థిక సహాయంతో అన్నమయ్య జిల్లా, ఆంధ్ర-ప్రదేశ్ లో సంజీవిని ఉమెన్ హెల్త్ కేర్ పేరిట పీలేరులో సర్వైకల్ క్యాన్సర్ అవగాహన, రక్షణ ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించ-బడుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం 16 నవంబర్ 2025 నాడు, కాకతీయ పబ్లిక్ స్కూల్ ఆవరణలో సంజీవని గ్రామీణ స్త్రీ ఆరోగ్య పరిరక్షణ ఉచిత వైద్య శిబిరం నిర్వహించబడింది. తిరుపతిలోని ప్రముఖ మెడిగో హాస్పిటల్ చెందిన గైనకాలజిస్టుల తదితర వైద్య నిపుణుల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం విజయవంతంగా నిర్వహించబడింది. మహిళా గైనకాలజిస్ట్ ల పర్యవేక్షణలో, పాల్గొన్న మహిళలలందరికీ గర్భాశయ క్యాన్సర్ పై అవగాహన కల్పించారు. మహిళల్లో సంభవించే వివిధ క్యాన్సర్లపై, అలాగే సర్వైకల్ క్యాన్సర్ రాకుండా తీసుకోవాల్సిన ప్రత్యేక శ్రద్ధలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే 50 మంది మహిళలకు ఉచిత పాప్ స్మియర్ టెస్టులు చేశారు. అలాగే పాల్గొన్న వాళ్లందరికీ ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస చారిటబుల్ ట్రస్టు ప్రోగ్రాం కోఆర్డినేటర్ శశికుమార్ రెడ్డి, ట్రస్ట్ సభ్యులు శ్రీనివాస్ రెడ్డి (జడ్పి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు), డా. జిలాని, షబ్బీర్, బాషా, వెంకట్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 126 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాల్గొన్న అందరు మహిళలకి ఉపయోగపడేలా ఇంత మంచి ఉచిత వైద్యశిబిరాలు, అందులోనూ ముఖ్యంగా గర్భాశయ క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమం మరియు ఉచిత గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్ లు చేయడాన్ని అందరూ మెచ్చుకున్నారు. ఇలాంటి వినూత్నమైన ఆరోగ్య కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన శ్రీ శ్రీనివాస చారిటబుల్ ట్రస్ట్ అలాగే ఈ కార్యక్రమాన్ని ఆర్థిక సహకారం అందిస్తున్న అరబిందో ఫార్మా ఫౌండేషన్ యాజమాన్యానికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

## 'అఖండ 2' లో హిందూ సనాతన ధర్మం యొక్క శక్తి, పరాక్రమాన్ని చూస్తారు - బాలకృష్ణ



నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను కలయికలో వస్తున్న పాన్ ఇండియా చిత్రం 'అఖండ 2: తాండవం'. ఈ సినిమాలో హిందూ సనాతన ధర్మం యొక్క శక్తి, పరాక్రమాన్ని చూస్తారని కథానాయకుడు బాలకృష్ణ అన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను వెంట తీసుకెళ్లి ఈ సినిమాను చూపించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ చిత్రం డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సినిమా ప్రచారంలో భాగంగా ముంబైలో చిత్ర బృందం ఓ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా "రంగ రంగ శంభు లింగ ఈశ్వర" అంటూ సాగే భక్తి గీతాన్ని విడుదల చేశారు. ఎస్.ఎస్. తమన్ స్వరపరిచిన ఈ పాటకు కల్యాణ్ చక్రవర్తి సాహిత్యం అందించగా, శంకర్ మహదేవన్, కైలాశ్ ఖేర్ అద్భుతంగా ఆలపించారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ మాట్లాడుతూ.. "నాది, బోయపాటిది విజయవంతమైన కలయిక. మేమిద్దరం కలిసి చేసిన గత మూడు చిత్రాలు విజయవంతమయ్యాయి. ఇది మాకు నాలుగో సినిమా" అని ధీమా వ్యక్తం చేశారు. దర్శకుడు బోయపాటి శ్రీను మాట్లాడుతూ.. "ఇది కేవలం సినిమా కాదు, భారతదేశ ఆత్మ. మన ధర్మం. అత్యంత శీతల వాతావరణంలో మేమంతా స్వెటర్లు వేసుకుని చిత్రీకరణలో పాల్గొంటే, బాలకృష్ణ గారు మాత్రం ఒక మామూలు పంచె కట్టుతో నటించారు. అది నటన పట్ల ఆయనకున్న నిబద్ధతకు నిదర్శనం. శివయ్యే మా వెనకుండి ఈ సినిమాను పూర్తి చేయించాడు" అని వివరించారు. రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మించిన ఈ చిత్రంలో సంయుక్తా మేనన్ కథానాయికగా నటించగా, ఆది పినిశెట్టి, జగపతిబాబు కీలక పాత్రలు పోషించారు. ఈ కార్యక్రమంలో తమన్, ఆది పినిశెట్టి, కైలాశ్ ఖేర్, నిర్మాతలు తదితరులు పాల్గొన్నారు.

## మహేశ్ బాబు 'వారణాసి' కోసం లేటెస్ట్ టెక్నాలజీ వాడుతున్న రాజమౌళి

- మహేశ్-రాజమౌళి సినిమాకు 'వారణాసి' టైటిల్ ఖరారు
- 'గ్లోబ్ ట్రాటర్' ఈవెంట్‌లో కాన్సెప్ట్ వీడియో విడుదల
- సరికొత్త ఐమాక్స్ టెక్నాలజీతో సినిమా చిత్రీకరణ
- అసలైన ఐమాక్స్ ఫార్మాట్‌లోనే సినిమాను తీస్తున్నామన్న రాజమౌళి
- హై క్వాలిటీ గ్రాఫిక్స్, వీఎఫ్ఎక్స్‌తో భారీ అంచనాలు
- యుగాలు, ఖండాలు దాటిన కథాంశంతో వస్తున్న వారణాసి




దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి, సూపర్‌స్టార్ మహేశ్‌బాబు కాంబినేషన్‌లో రాబోతున్న భారీ చిత్రం 'వారణాసి' కోసం సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నారు. ఇప్పటివరకు భారతీయ సినిమాల్లో చూడని విధంగా ఈ చిత్రాన్ని పూర్తిగా అసలైన ఐమాక్స్ కెమెరాలతో చిత్రీకరిస్తున్నట్లు రాజమౌళి స్వయంగా వెల్లడించారు. ఈ టెక్నాలజీ ప్రేక్షకులకు మునుపెన్నడూ లేని సినిమాటిక్ అనుభూతిని అందిస్తుందని ఆయన తెలిపారు. ఈ చిత్రానికి 'వారణాసి' అనే టైటిల్‌ను అధికారికంగా ఖరారు చేశారు. హైదరాబాదులో నిన్న రాత్రి జరిగిన 'గ్లోబ్ ట్రాటర్' ఈవెంట్‌లో చిత్ర టైటిల్‌తో పాటు 'వారణాసి యూనివర్స్' పేరుతో ఒక కాన్సెప్ట్ వీడియోను విడుదల చేశారు. దాదాపు నాలుగు నిమిషాల నిడివి ఉన్న ఈ వీడియో, అద్భుతమైన విజువల్స్‌తో ప్రేక్షకులను మరో ప్రపంచంలోకి తీసుకెళ్లింది. యుగాలు, ఖండాలు, సంస్కృతులను దాటి భూమి నుంచి అంతరిక్షం వరకు సాగే కథాంశాన్ని ఈ వీడియో ఆవిష్కరించింది. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ, "ఇప్పటివరకు మనం సినిమాలను సాధారణ స్కోప్‌లో చిత్రీకరించి, దానిని ఐమాక్స్ ఫార్మాట్‌లోకి బ్లో అప్ చేసి చూపించేవాళ్లం. కానీ, వారణాసి చిత్రాన్ని మాత్రం నేరుగా అసలైన ఐమాక్స్ ఫార్మాట్‌లోనే చిత్రీకరించి విడుదల చేస్తున్నాం" అని వివరించారు. హై క్వాలిటీ వీఎఫ్ఎక్స్, గ్రాఫిక్స్‌తో పాటు ఈ అధునాతన టెక్నాలజీ కూడా తోడవడంతో సినిమాపై అంచనాలు తారాస్థాయికి చేరాయి.

## అదోక చేదు అనుభవం - మంచు లక్ష్మి

నటి, నిర్మాత మంచు లక్ష్మి తన జీవితంలో జరిగిన ఓ చేదు అనుభవాన్ని పంచుకున్నారు. 15 ఏళ్ల వయసులో పబ్లిక్ బస్సులో ప్రయాణిస్తున్నప్పుడు తనకు లైంగిక వేధింపులు ఎదురయ్యాయని, ఆ భయంకర ఘటన తనను ఇప్పటికీ వెంటాడుతోందని ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. సెలబ్రిటీ కుటుంబం నుంచి వచ్చిన తనకే ఇలాంటి పరిస్థితి ఎదురైతే, సామాన్య మహిళల పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందోనని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నప్పుడు తాను ఎప్పుడూ సొంత వాహనంలోనే ప్రయాణించేదాన్నని, బాడీగార్డులు ఉండేవారని లక్ష్మి గుర్తుచేసుకున్నారు. అయితే, పరీక్షల హాల్ టికెట్ల కోసం స్కూల్ యాజమాన్యం విద్యార్థులను పబ్లిక్ బస్సులో తీసుకెళ్లిందని వెల్లడించారు. అదే తన మొదటి బస్సు ప్రయాణమని, ఎంతో ఉత్సాహంగా ఉన్న సమయంలో ఓ వ్యక్తి తనను అసభ్యంగా తాకడంతో షాక్‌కు గురయ్యానని ఆమె తెలిపారు. ఆ క్షణంలో ఏం జరిగిందో కూడా తనకు అర్థం కాలేదని, భయంతో వణికిపోయానని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం స్నేహితులతో పంచుకున్న తర్వాత కాస్త ధైర్యం వచ్చిందన్నారు. రోజూ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌లో ప్రయాణించే మహిళలు ఇలాంటి ఎన్నో అవమానాలను ఎదుర్కొంటూ మౌనంగా భరిస్తున్నారని ఆమె అన్నారు. ఎంతో మంది మహిళలు తమకు ఎదురయ్యే వేధింపుల గురించి బయటకు చెప్పుకోలేక మానసిక క్షోభ అనుభవిస్తున్నారని మంచు లక్ష్మి పేర్కొన్నారు. మహిళల భద్రత కోసం సమాజం బాధ్యత తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆమె పిలుపునిచ్చారు.




## హీరోల్లా మేమెందుకు చేయకూడదు? - నటి కామాక్షి

అల్లరి నరేశ్, కామాక్షి భాస్కర్ల జంటగా నటించిన చిత్రం '12ఎ రైల్వే కాలనీ'. నాని కాసరగడ్డ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఈ నెల 21న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కామాక్షి భాస్కర్ల సినిమా విశేషాలను పంచుకున్నారు. ఈ చిత్రం మంచి ప్రేమకథతో కూడిన ఒక బిగువైన కథనంతో సాగే సస్పెన్స్ థ్రిల్లర్ అని ఆమె తెలిపారు. "తర్వాత ఏం జరుగుతుందోనన్న ఆసక్తిని రేకెత్తిస్తూ సినిమా సాగుతుంది. ఇందులో నేను ఆరాధన అనే పాత్రలో కనిపిస్తాను. ఈ పాత్ర లేకపోతే ఈ కథే లేదు. సినిమా చూసిన తర్వాత ప్రతి ఒక్కరికీ నా పాత్ర గుర్తుండిపోతుంది" అని కామాక్షి ధీమా వ్యక్తం చేశారు. తన సినీ ప్రయాణం గురించి మాట్లాడుతూ .. విజయ్ సేతుపతి, శ్రీవిష్ణు, సుహాస్ వంటి హీరోలు అన్ని రకాల పాత్రలు చేస్తున్నారని, హీరోయిన్లు కూడా అలా ఎందుకు చేయకూడదని తాను సవాల్‌గా తీసుకుని విభిన్నమైన పాత్రలు ఎంచుకుంటున్నానని తెలిపింది. గత ఐదేళ్లలో 'విరూపాక్ష', 'పొలిమేర' వంటి చిత్రాలు తనకు మంచి పేరు తెచ్చిపెట్టాయని పేర్కొంది.




## 'చంద్రముఖి' విషయంలో అలా జరిగిందట!

'చంద్రముఖి' .. రజనీకాంత్ కెరియర్లో చెప్పుకోదగిన సినిమా. జ్యోతిక .. నయనతార .. ప్రభు ముఖ్యమైన పాత్రలను పోషించారు. పి.వాసు దర్శకత్వం వహించిన ఈ సినిమా, 2005లో థియేటర్లకు వచ్చింది. కథాకథనాల పరంగా .. సంగీతం పరంగా ప్రశంసలను అందుకుంది. ఈ సినిమాను ఇప్పటికీ ఎవరూ మరిచిపోకపోవడం విశేషం. అలాంటి ఈ సినిమాను గురించి, రీసెంటుగా ఓ ఛానల్ కి ఇచ్చిన ఇంటర్వ్యూలో సంగీత దర్శకుడు విద్యాసాగర్ ప్రస్తావించారు. "సంగీత దర్శకుడిగా 35 ఏళ్లుగా నా ప్రయాణం కొనసాగుతూ వచ్చింది. అయితే ఈ సుదీర్ఘమైన నా ప్రయాణంలో రజనీకాంత్ గారితో కలిసి ఒకే ఒక్క సినిమాకు పనిచేశాను. ఆ సినిమా పేరే 'చంద్రముఖి'. ఈ సినిమా మ్యూజిక్ సిటింగ్స్ లో మొదటి రోజున రజనీకాంత్ గారు వచ్చారు. ఈ సినిమాలో రెండు పాటలు తప్పకుండా హిట్ కావాలని రజనీ సార్ అన్నారు. 'ఐదు పాటలు హిట్ చేద్దాం సార్' అన్నాను నేను. "నేను ఆ మాట అనగానే రజనీ సార్ నా వైపు ఒకలా చూశారు. నేను చాలా ఓవర్ కాన్ఫిడెన్స్ తో మాట్లాడానని ఆయన అనుకున్నారేమో. ఐదు పాటలు హిట్ చేసి పెట్టమని నేను దేవుడిని కోరుకున్నాను. సినిమా రిలీజ్ తరువాత అన్ని పాటలు హిట్ అనే టాక్ వచ్చింది. రజనీ సార్ చాలా హ్యాపీగా ఫీలయ్యారు. 200 రోజుల వేడుక సమయంలో స్టేజ్ పై ఆయన నా గురించి చెప్పారు. 'రా రా' అనే పాట, తమిళనాడు అంతటా మారుమ్రోగిన ఏకైక తెలుగు పాటగా నిలిచింది" అని చెప్పారు.




## 75 మిలియన్ వ్యూస్... యూట్యూబ్ ట్రెండింగ్ లో నెంబర్ వన్ గా రామ్ చరణ్ 'చికిరి' సాంగ్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రం 'పెద్ది'. ఈ సినిమా నుంచి ఇటీవల విడుదలైన 'చికిరి చికిరి' పాట యూట్యూబ్‌లో సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. విడుదలైన రోజు నుంచే సంగీత ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటున్న ఈ పాట, తాజాగా 75 మిలియన్లకు పైగా వ్యూస్‌ను, 1.44 మిలియన్లకు పైగా లైక్స్‌ను సొంతం చేసుకుంది. ప్రస్తుతం యూట్యూబ్ మ్యూజిక్ ట్రెండింగ్‌లో ఈ పాట నంబర్ వన్ స్థానంలో కొనసాగుతుండటం విశేషం. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ స్వరపరిచిన ఈ మెలోడీకి ప్రముఖ గాయకుడు మోహిత్ చౌహాన్ తన గాత్రంతో ప్రాణం పోశారు. బాలాజీ అందించిన సాహిత్యం పాటకు మరింత ఆకర్షణ తీసుకొచ్చింది. ఈ పాట విజయం సినిమాపై అంచనాలను రెట్టింపు చేసింది. రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ కీలక పాత్రలలో కనిపించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రత్నవేలు సినిమాటోగ్రఫీ, నవీన్ నూలి ఎడిటింగ్ అందిస్తున్నారు. ఈ చిత్రాన్ని 2026 మార్చి 27న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.




Printed,Published by,Owened by GADDAM NAGARAJU & Printed at ,arun publication ,HNO 51/1 indhiramma colony,phase 1,nizampet, Hyderabad RNI. NO TELTEL/2022/83463 & Published at .HNO 3-123shivanagar colony,Ellanda, Wardhannapet, warangal 506313.. telangana
EDITOR : GADDAM NAGARAJU . CELL :9494923460 . Website : WWW.tharangalu.com Email : nagarajugaddam009@gmail.com